
## రైతు కుటుంబానికి చెక్కు అందజేత



రైతు కుటుంబానికి రూ. 25వేల చెక్కును అందజేస్తున్న చైర్మన్ చేగూరి భరత్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 20 : బాటసింగారం రైతు సేవా సహకార సంఘంలో సభ్యులైన రైతులు మరణిస్తే ఆ కుటుంబాలకు తమ వంతు ఆర్థిక సహాయం అందించి అండగా నిలుస్తున్నామని సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట గ్రామానికి చెందిన చేగూరి కొమరయ్య మార్చి 29న మృతి చెందాడు. మండల కేంద్రంలోని సంఘం ప్రధాన కార్యాలయంలో మృతుడి కుటుంబానికి రూ. 25 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ వార్డు సభ్యుడు చేగూరి కృష్ణ, బ్యాంక్ అకౌంటెంట్ మోడెపు రాఖేశ్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

## సమాజ సేవలో భాగస్వాములవ్వాలి



పేదింటి ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక సాయం అందజేస్తున్న జడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్, ఏప్రిల్ 20 : సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో పేద కుటుంబానికి చెందిన సంతోశ్-శరణప్ప దంపతుల కుమార్తె స్నేహ వివాహం ఈ నెల 21న జరుగనుంది. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ శనివారం ఉదయం స్థానిక నాయకులతో కలిసి రాధాకృష్ణ ట్రస్టు తరపున రూ.21 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పేదలను ఆదుకోవడమే ట్రస్టు లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, హరిచంద్‌నాయక్, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు కృష్ణ, అంజి, శ్రీకాంత్, మహేశ్, టీకులాల్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## విస్తృతసాయి సమావేశానికి తరలిన నాయకులు



సమావేశానికి వెళ్తున్న జడ్పీటీసీ దశరథ్‌నాయక్, బీఆర్ఎస్ శ్రేణులు

కడ్తాల్, ఏప్రిల్ 20 : ఆమనగల్లు పట్టణంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి మండలం నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో వాహన ర్యాలీని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఊపి ప్రారంభించారు. సమావేశానికి తరలిన వారిలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీలు గోపాల్, లచ్చిరాంనాయక్, మంజుల, ప్రియ, సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు వీరయ్య, నర్సింహాగౌడ్, రామకృష్ణ, చంద్రమౌళి, రమేశ్, సాయిలు పాల్గొన్నారు.

# కాసాని గెలుపు ఖాయం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- ఎన్నికల ప్రచార వాహనాలకు పూజలు

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 20 : బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం చేవెళ్ల మండలం కుమ్మెర గ్రామ గేట్ సమీపంలోని బంగారు మైసమ్మ దేవాలయం వద్ద ఎన్నికల ప్రచార వాహనాలకు ఆయన పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం రావులపల్లిలో ఇంటింటి ప్రచారం చేయడంతోపాటు చేవెళ్ల మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపిన కేసీఆర్ కాసాని గెలుపును కానుకగా ఇద్దామన్నారు. పేదల కష్టాలు తీర్చి గొప్ప నాయకుడని, సీఎంగా ఇవ్వని హామీలను సైతం నెరవేర్చారన్నారు. ఏడాదికి రూ.10వేలు రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలను అన్నదాతలకు అండగా నిలిచారన్నారు. కాంగ్రెస్ 6 గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి.. ఇప్పటివరకు ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో తన తరపున 21 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్‌ను అర్హులకు ఇప్పించినట్లు తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ సీఎం రిలీఫ్‌ఫండ్ ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. అధికారంలోకి రాగనే రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇంతవరకు ఎందుకు అమలు చేయలేదన్నారు. కనీసం సరిపడా సాగు, తాగు నీరు ఇద్దామన్నసోయి కూడా రేవంత్ సర్కార్ లేదన్నారు. రూ.24 కోట్లతో ముడిమ్యాల నుంచి రావుపల్లి, మేడిపల్లి వరకు, రూ.34 కోట్లతో పొద్దటూర్ గేట్ నుంచి ఎల్వర్తి గేట్ వరకు రోడ్డు మంజూరు చేయించామని, ఏదేమైనా పనులను పూర్తి చేసి తీరుతామన్నారు. అమలుగాని హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచాలంటే చేవెళ్ల ఎంపీగా కాసాని జ్ఞానేశ్వర్ గెలిపించుకోలన్నారు. ఎమ్మెల్సీగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఆయనకు ఎంతో అనుభవమున్నదని, అత్యధిక మెజారిటీ అదించి ప్రగతిని స్వాగతించాలన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గం అసెంబ్లీ ఇన్‌చార్జి రాంబాబు యాదవ్, సీనియార్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, చేవెళ్ల మండల సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివారెడ్డి, రావులపల్లి గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్, బుచ్చయ్య, హన్మంత్‌రెడ్డి, సుశీల బాల్‌రాజ్, మాజీ ఎంపీటీసీ కిష్టయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రాములు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గరిధర్‌రెడ్డి, మాజీ డైరెక్టర్లు వెంకటేశ్, మహేశ్, గని, వార్డు సభ్యులు కుమ్మరి వరలక్ష్మి విఠలయ్య, నాయకులు దండు సత్తి, చందు, ఎల్లయ్య, చింటు, శ్రీకాంత్, రాము ప్రసాద్, మహేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



రావుల పల్లి గ్రామంలో ఎన్నిల ప్రచారం చేస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



చేవెళ్లలోని బంగారు మైసమ్మ దేవాలమం వద్ద ఎమ్మెల్యే ప్రారంభించిన ప్రచార వాహనాలు

## జొన్న పశుగ్రాసం తిని గొర్రెలు మృతి

- 80 జీవాలకు తీవ్ర అస్వస్థత
- పరిశీలించిన వైద్యాధికారులు



జీవాలను పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధక అధికారి అనీల్‌కుమార్

దోమ, ఏప్రిల్ 20 : జొన్న పశుగ్రాసం మేసి 21 జీవాలు మృత్యువాతపడ్డాయి. ఈ ఘటన మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో జరిగింది. పశువైద్యాధికారి వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన బట్టీల శీనయ్యకు చెందిన గొర్రెలు శుక్రవారం సాయంత్రం లేత దశలో ఎండిన జొన్న పశుగ్రాసాన్ని తిన్నాయి. వాటిని తిన్న గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. 21 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. 80 జీవాలు అస్వస్థతకు గురయ్యాయి. మృతి చెందిన జీవాలను మండల పశువైద్యాధికారి ఆనంద్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి అనీల్‌కుమార్ పరిశీలించారు. అనంతరం గ్రామ గొర్రెల కాపరులతో సమావేశమై.. లేత దశలో ఉన్న జొన్న రకాల పశుగ్రాసాలను జీవాలకు వేయవద్దని, వాటి వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

## స్నానానికి వెళ్లి పుష్కరిణిలో గల్లంతు

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 20: చేవెళ్లలోని వేంకటేశ్వర ఆలయ పుష్కరిణిలోకి స్నానానికి వెళ్లిన వ్యక్తి గల్లంతయ్యాడు. ఈఘటన శనివారం వెలుగుచూసింది. సీఐ లక్ష్మారెడ్డి వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన రవి (38) , శ్రీను, మరో వ్యక్తి కలిసి తాపీ మేస్త్రి పని చేసుకుంటు జీవనం కొనసాగిస్తున్నారు. బతుకు దెరువు కోసం రాజేంద్రనగర్ మండలంలోని బండ్లగూడ ప్రాంతంలోని కాళీమందిర్ వద్ద ఉంటున్నారు. షాబాద్ మండలంలోని ఎట్ల ఎర్రవల్లి గ్రామంలో ఇంటి నిర్మాణం కోసం చేవెళ్లకు వచ్చారు. ముగ్గురు మద్యం సేవించి ఆ మత్తులో చేవెళ్లలోని వేంకటేశ్వర స్వామి పుష్కరిణిలో స్నానం చేసేందుకు వెళ్లారు. శ్రీను, మరో వ్యక్తి ఈత రాకపోడంతో పుష్కరిణి ఒడ్డున స్నానం చేస్తున్నారు. రవికి ఈత రావడంతో తాగిన మైకంలో ఇవతలి వడ్డు నుంచి అవతలి వడ్డుకు వెళ్లగానే ఊపిరాడక నీటిలో మునిగి గల్లంతయ్యాడు. ఎంతసేపు చూసినా అతను బయటకు రాకపోవడంతో ఉన్నవారు పోలీసులకు సమాచారం అందజేశారు. సీఐ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మొయినాబాద్ నుంచి శనివారం గజ ఈతగాళ్లతో వెతికిస్తున్నారు.

## మూడో రోజు ఆరు నామినేషన్లు

షాబాద్, ఏప్రిల్ 20: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా చేవెళ్ల లోక్‌సభ నియోజక వర్గానికి సంబంధించి శనివారం ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని రంగారెడ్డి జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక తెలిపారు. మహమ్మద్ సలీం రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్(సెక్యులర్)పార్టీ అభ్యర్థిగా(1)సెట్, స్వతంత్ర అభ్యర్థిగా(1)సెట్ నామినేషన్ సమర్పించారని తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా ఇసరి సూర్యప్రకాశ్‌రెడ్డి, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా తోట్ల రాఘవేందర్, స్వతంత్ర అభ్యర్థిగా నీరటి ఆంజనేయులు, ప్రజా వెలుగు పార్టీ అభ్యర్థిగా టి. దుర్గ ప్రసాద్‌లు ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ వేశారు.

## తల్లీకూతుళ్ల అదృశ్యం

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 20: రెండేండ్ల కుమార్తె సహా తల్లి అదృశ్యమైన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని బాచారం గ్రామానికి చెందిన బొడిగె తరుణి, మహేశ్ భార్యాభర్తలు. వారికి నాలుగేండ్ల కొడుకు, రెండేండ్ల కూతురు శాన్విశ్రీ ఉన్నారు. ఈ నెల 17న మహేశ్‌తో తరుణి గొడవ పడి శాన్విశ్రీతో కలిసి పుట్టిళ్లు అనాజ్‌పురానికి వచ్చింది. ఈ నెల 19న కుటుంబ సభ్యులకు చెప్పకుండా కూతురుతో కలిసి తరుణి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారి ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. తరుణి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజమల్లేశ

మొయినాబాద్, ఏప్రిల్ 20 : మండల పరిధిలోని చిన్నమంగళారం పంచాయతీ అనుబంధ గ్రామమైన వీరన్నపేట గ్రామానికి చెందిన రాజమల్లేశ్ బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైనారు. శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి, జిల్లా మోర్చా అధ్యక్షుడు యాదీశ్ చేతులు మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నాడు.

## ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటా



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా

ఆమనగల్లు, ఏప్రిల్ 20 : ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న తలారి మహేశ్ తండ్రి రామలింగయ్య శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వెంకటేశ్‌గుప్తా పీఏసీఎస్ వైస్ చైర్మన్ సత్యంతో కలిసి రామలింగయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్టు తరపున వెంకటేశ్ రూ.5 వేలు, వైస్ చైర్మన్ రూ.2 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట పీఏసీఎస్ డైరెక్టర్లు రమేశ్, సీఈవో దేవేందర్, సిబ్బంది పద్మాకర్‌రెడ్డి, సురేశ్, భాస్కర్, మహేశ్, మహేందర్, ప్రశాంత్ ఉన్నారు.

## పేదలకు ఉప్పల ఫౌండేషన్ చేయూత



ఆర్థిక సహాయం అందజేస్తున్న రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గుప్త

మన్సూరాబాద్, ఏప్రిల్ 20: నిరుపేద కుటుంబాల్లో జరుగుతున్న ముగ్గురు ఆడబిడ్డల వివాహానికి ఉప్పల ఫౌండేషన్ చేయూతనిచ్చింది. రంగారెడ్డి జిల్లా, మెయినాబాద్ మండలం, మేడిపల్లి గ్రామానికి చెందిన ప్రశాంతి, నందిని, నందినిల వివాహాలు ఇటీవల నిశ్చయమయ్యాయి. మూడు కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి ఉప్పల ఫౌండేషన్ ద్వారా నాగోల్, కోఆపరేటివ్ బ్యాంకు కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెండ్లి కూతుర్లు ప్రశాంతి, నందిని, పి నందినిలకు పుస్తె, మట్టెలు, చీర, గాజులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు రాములు పాల్గొన్నారు.

## గుండెపోటుతో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

ఇబ్రహీంపట్నంరూరల్, ఏప్రిల్ 20 : గుండెపోటుతో కారణంగా అకాల మరణాలు ఇటీవల అధికమయ్యాయి. 20 ఏండ్లకే ఓ ఇంజినీరింగ్ విద్యార్థి గుండె ఆగింది. గుండెలో నొప్పితో హాస్టల్‌లో ఒక్కసారిగా కుప్పకూలాడు. ఆ యువకుడిని తోటి విద్యార్థులు ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలోనే కన్నుమూశాడు. పోలీసులు, తోటి విద్యార్థుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి దేవరోని తండాకు చెందిన ఇస్లావత్ సిద్ధు(20) శ్రీదత్త ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లోమా ఈఈఈ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నాడు. స్నేహితులతో కలిసి ఉండగా సిద్ధు గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే అప్రమత్తమైన తోటి విద్యార్థులు హాస్టల్ సిబ్బందితో కలిసి ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు.

## నిజాయితీ చాటుకున్న యువకుడు



ఆభరణాలను బాధితురాలికి అప్పగిస్తున్న యువకుడు

కందుకూరు. ఏప్రిల్ 20 : దొరికిన ఆభరణాలను తిరిగి ఇచ్చి ఓ యువకుడు తన నిజాయితీని చాటుకున్నాడు. మండల పరిధిలోని జైత్వారం గ్రామానికి చెందిన ఈర్లపల్లి రాణి తన తల్లి గారింటికి వెళ్లడానికి కందుకూరు మండల కేంద్రానికి వచ్చి బస్సు ఎక్కి వెళ్లే సమయంలో 30 తులాల వెండి పట్టగొలుసులు, చెవుల గొలుసును పోగొట్టుకుంది. ఈ ఆభరణాలు దెబ్బడగూడ గ్రామానికి చెందిన అజీజ్ దొరకడంతో వెంటనే కందుకూరు పోలీస్ స్టేషన్ ఎస్సై శ్రావణ్‌కు అప్పగించడంతో సదరు మహిళలను పిలిపించి అప్పగించారు. దొరికిన వెండి ఆభరణాలు తిరిగి ఇవ్వడంతో అజీజ్‌ను ఎస్ఐ అభినందించారు. రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి లేకుండా ప్రణాళికలు

- ఎంపీపీ బుర్ర రేఖ

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 20 : వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బుర్ర రేఖ అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధ శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో అధికారులు చేపట్టే ప్రతీ విషయాన్ని ఎంపీటీసీలకు తెలియజేయాలని సూచించారు. వివిధ గ్రామాల సమస్యలను ఎంపీటీసీలు సభలో ప్రస్తావించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బింగి దాస్‌గౌడ్, ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీటీసీలు భీమగోని భాస్కర్‌గౌడ్, కేశెట్టి వెంకటేశ్, దంతూరి అనిత, చేగూరి వెంకటేశ్, గ్యార బాలలింగస్వామి, రాచపాక లావణ్య, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌస్‌పాష, ఎంపీడీవో వినోద, ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.




సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బుర్ర రేఖ

## ఓపెన్ డిగ్రీ పరీక్ష ఫీజు గడువు మే 6

హయత్‌నగర్, ఏప్రిల్ 20 : బీఆర్ఏఓయూ బీఏ, బీకాం, బీఎస్సీ ఫస్టియర్ విద్యార్థులు మొదటి సెమిస్టర్ ఎగ్జామ్ ఫీజును మే 6లోపు చెల్లించాలని హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్నప్రభ, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ శంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు మే 26 నుంచి జూన్ 1 వరకు జరుగుతాయని వెల్లడించారు. పరీక్ష ఫీజు ప్రతి పేపర్‌కు రూ.150 చొప్పున, ప్రాక్టికల్ ఉన్న కోర్సుల్లో చేరిన విద్యార్థులు ప్రతి ప్రాక్టికల్ సబ్జెక్టుకు అదనంగా రూ.150 చొప్పున చెల్లించాలని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష ఫీజులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు. http: //www.braouonline.in/ వెబ్‌సైట్‌ను సందర్శించి చెల్లించాలని సూచించారు. వివరాల కోసం 738 292 9771 లో సంప్రదించాలని కోరారు.

## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం..

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ
- బీఆర్ఎస్‌లో తిరిగి చేరిన మహిళా నేత



ఎస్‌కే బీబీకి గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, ఏప్రిల్ 20 : ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండకు చెందిన మహిళా నేత తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. శనివారం ఎమ్మెల్యే గాంధీ తన నివాసంలో మహిళా నేత ఎస్‌కే బీబీకీ గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నిఖార్సయిన కార్యకర్తలెవరూ గులాబీ జెండాను వీడిపోరన్నారు. పార్టీ శ్రేణులను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను అధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. బూటకపు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిందని, పార్లమెంటు ఎన్నికల అనంతరం గులాబీ జెండా మళ్లీ పుంజుకుంటుందన్నారు. కార్యక్రమంలో సంతోష్‌రావు, కాశీనాథ్‌యాదవ్, శ్రీనివాస్,కిషన్, మంజుల పాల్గొన్నారు.



## ఆర్ట్ గ్యాలరీలో చిత్ర ప్రదర్శనలు

కొండాపూర్, ఏప్రిల్ 20 : మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శనివారం పలు పెయింటింగ్స్ సందర్శకులను ఆకట్టుకున్నాయి. చిత్రకారుడు వీ లక్ష్మణ్ 'నేచర్ విత్ హ్యూమన్ ఫేస్' పేరుతో ఏర్పాటు చేసిన సోలో పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను సినీ నిర్మాత, దర్శకుడు లయన్ డాక్టర్ సాయివెంకట్, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ప్రెసిడెంట్ ఎంవీ రమణారెడ్డి, సీనియర్ ఆర్టిస్ట్ విజయ్‌కుమార్ ప్రదర్శనను ప్రారంభించారు. ప్రదర్శనలో 27 చిత్రాలను ఆదివారం వరకు ఉంచనున్నట్లు తెలిపారు. దేశంలోని చిత్రకారులు వేసిన 41 చిత్రాలతో 'అన్ ఇంక్లూజివ్ ఆర్ట్ ఎగ్జిబిషన్' పేరుతో చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు.

## మద్యం తాగొద్దన్నందుకు వ్యక్తి ఆత్మహత్య

కొండాపూర్, ఏప్రిల్ 20 : మద్యం తాగొద్దన్నందుకు భార్యతో గొడవ పడిన భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ భానుప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన మోరి రాజు(32), భార్య, ముగ్గురు కూతుళ్లతో కలిసి నివాసం ఉంటున్నాడు. సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన రాజు గత కొద్దిరోజులుగా డ్యూటీకి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చిన రాజుతో భార్య ప్రియాంక మద్యం తాగవద్దని గొడవ పడింది. దీంతో అర్ధరాత్రి తాను నిద్రిస్తున్న గది పైకప్పు హుక్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన ప్రియాంక పోలీసులకు సమాచారం అందించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## తాగి వాంతులు చేసుకుని యువకుడి మృతి

కొండాపూర్, ఏప్రిల్ 20 : మద్యం సేవించిన ఓ యువకుడు వాంతులు చేసుకుని మృతిచెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అస్సాం రాష్ట్రం ఉత్తర లిఖింపూర్ జిల్లా పానిగావ్ గ్రామానికి చెందిన సీమంత దత్త రెండు నెలల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా దత్త రూమ్‌మేట్ ప్రభాకర్ దొరువా శుక్రవారం రాత్రి 10:30 గంటలకు ఫోన్ చేయగా కేశవనగర్‌లో ఉన్నట్లు తెలిపాడు. అక్కడికి వెళ్లి చూడగా మద్యం మత్తులో దత్త వాంతులు చేసుకుంటూ కనిపించాడు. రూమ్‌కు వెళదామనగా నేను తర్వాత వస్తానంటూ అక్కడే ఉండిపోయాడు. అర్ధరాత్రి తర్వాత తీవ్రంగా వాంతులు చేసుకుని మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.



వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మాదాపూర్‌లోని శిల్పారామంలో కళాకారుల నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. శనివారం సత్యం డాన్స్ అకాడమీ గురువులు మేళ్లచెరువు కామేశ్వరి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనతో అలరించారు. – కొండాపూర్